క్లుప్తంగా

నేడు విద్యుత్‌కు అంతరాయం

కొండపాక(గజ్వేల్)/బెజ్జంకి(సిద్దిపేట)/మిరుదొడ్డి(దుబ్బాక)/ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మండలంలోని అంకిరెడ్డిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల వల్ల మంగళవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ నిలిపివేస్తామని ఏఈ సత్యం తెలిపారు. అదే విధంగా బెజ్జంకి మండలంలోని బేగంపేటలోని 33కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం వరకు ఫీడర్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏడీఈ సుధీర్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిరుదొడ్డి మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏడీఈ సీహెచ్ గంగాధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రశాంత్‌నగర్ ఉమాపార్థీశ్వర కోటిలింగాల ఆలయం, టీటీడీ 11కేవీ ఫీడర్‌ల పరిధిలోని విద్యుత్ సరఫరా లైన్‌ల కింద చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సిద్దిపేట పట్టణ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వెంకటయ్య

మిరుదొడ్డి(దుబ్బాక): జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సోమవారం అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో మాల మహానాడు నాయకులతో కలిసి మాలల మహా పాదయాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర పొలిట్ బ్యూరో చైర్మన్ ర్యాకం శ్రీరాములు, జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు మండల యాదగిరి, జిల్లా నాయకులు రవి, కుమారస్వామి, రాజు, రమేశ్, కుమార్, వెంకటేశ్, నర్సింహులు, పరశురాములు, రాములు, అనిల్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం


భాస్కర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

వర్గల్(గజ్వేల్): ఉపాధ్యాయుడిగా, సంఘ బాధ్యుడిగా భాస్కర్‌రెడ్డి ఎనలేని సేవలందించారని పీఆర్‌టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి శశిధర్‌శర్మ, చౌదరిపల్లి జెడ్పీహైస్కూల్ హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి కొనియాడారు. విరమణ పొందిన ఆయనను చౌదరిపల్లి జెడ్పీహైస్కూల్ ఆవరణలో సోమవారం హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి అధ్యక్షతన ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. మూడు దశాబ్దాలకు పైగా సేవలందించిన భాస్కర్‌రెడ్డి ఉపాధ్యాయులపై చెరగని ముద్ర వేశారని ప్రశంసించారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు జె.శ్రీనివాస్, పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, బుచ్చిరాములు, ప్రశాంత్‌కుమార్, శ్రీపాల్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ పరిషత్ అధ్యక్షుడిగా వెంకటరాజ్‌చారి

దుబ్బాక: అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ దుబ్బాక నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర నాయకుడు శ్రీరాముల వేణుగోపాలచారి, జిల్లా అధ్యక్షుడు నర్సింహాచారి ఆధ్వర్యంలో సోమవారం ఎన్నుకున్నారు. దుబ్బాక అధ్యక్షుడుగా సుంకోజి వెంకటరాజ్‌చారి, ఉపాధ్యక్షుడుగా అమృతోజు నాగరాజుచారి, ప్రధానకార్యదర్శిగా రాజేశం, సహాయకార్యదర్శిగా కమ్మరి స్వామి, కోశాధికారిగా శ్రీనివాస్, సలహాదారులుగా చంద్రమౌళి, కిషన్, గోవర్ధన్, రాజు తదితరులను ఎంపికచేశారు.


జ్యోతులు వెలిగిస్తున్న మహిళలు

సహస్ర దీపాలంకరణ

హుస్నాబాద్: కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని పట్టణంలోని కాశీ మరకత లింగేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం రాత్రి భక్తుల సందడి నెలకొంది. మహిళలు వెలిగించిన సహస్ర దీపాలంకరణతో ఆలయం దేదీప్యమానంగా వెలుగొందింది. శివలింగం ఆకృతిలో కార్తీక దీపాలు వెలగించి ప్రత్యేక పూజలు చేశారు. సహస్ర పారాయణాన్ని పఠించారు.

'సేంద్రియ' తయారీ ఎక్కడ?

నిరుపయోగంగా డంపింగ్ యార్డులు
- పాతబావులు, గుంతల్లోనే చెత్త పారబోత
- కన్నెత్తిచూడని అధికారులు


నిరుపయోగంగా ఉన్న చౌటపల్లి డంపింగ్ యార్డు

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన డంపింగ్ యార్డులు నిరుపయోగంగా మారాయి. గ్రామాల్లో సేకరించిన చెత్తతో సేంద్రియ ఎరువులు తయారుచేసి పంచాయతీలు ఆదాయం పొందాలనే లక్ష్యంతో వాటి నిర్మాణం చేపట్టారు. కాని ఎక్కడా వినియోగంలో ఉన్నట్లు కనిపించడం లేదు.

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలో 31గ్రామాల్లో డంపింగ్ యార్డులు నిర్మించారు. ఒక్కో డంపింగ్ యార్డ్ నిర్మాణానికి ప్రభుత్వం దాదాపుగా రూ.2.50లక్షలు ఖర్చు చేసింది. అయితే కట్కూర్, అంతక్కపేట, మల్లంపల్లి, గోవర్ధనగిరి గ్రామాల్లో మాత్రమే డంపింగ్ యార్డులు వినియోగంలో ఉన్నట్లు తెలుస్తోంది. మిగతా అన్నిచోట్ల నిరుపయోగంగా ఉన్నాయి.

మందుబాబులకు అడ్డాలు

గుబ్బడి, మైసమ్మవాగుతండా, పంతుల్‌తండా, రామవరం గ్రామాల్లోని డంపింగ్ యార్డులు మందు బాబులకు అడ్డగా మారాయి. కొన్నిచోట్ల అయితే పశువులను కట్టేస్తున్నారు. డంపింగ్ యార్డుల్లో పొడి చెత్తను వేరుచేసి ఎరువు తయారీతో పాటు వానపాములను ఉత్పత్తి చేయాలనివాటిని నిర్మించారు. ఇక్కడ తయారైన ఎరువును రైతులకు విక్రయిస్తే పంచాయతీకి కొంత ఆదాయం సమకూరుతుంది. కాని చెత్తతో ఎరువులు తయారు చేయడం ఏ గ్రామంలోను కనిపించడంలేదు, డంపింగ్ యార్డులకు చెత్తను తీసుకురాకుండా గ్రామాల సమీపంలోని పాత వ్యవసాయ బావులు, గుంతల్లో పడేస్తున్నారు. అయినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. లక్షల రూపాయలు ఖర్చుచేసి నిర్మించిన డంపింగ్ యార్డులను వినియోగించుకోలేకపోతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

మరుగుదొడ్లు ఉన్నా నీటి వసతి లేదు

డంపింగ్ యార్డుల వద్ద మరుగుదొడ్లను నిర్మించారు. కొన్ని గ్రామాల్లో తూతూమంత్రంగా నిర్మించి వదిలేశారు. వాటిల్లో నీటి వసతి కల్పించడంలో పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వహించారు. దీంతో కాలకృత్యాల తీర్చుకోవడానికి ఆరుబయటకు వెళ్లాల్సి వస్తుందని కార్మికులు వాపోతున్నారు.

> **వినియోగంలో తీసుకు వస్తాం**
>
> 
>
> త్వరలోనే అన్ని డంపింగ్ యార్డులను వినియోగంలోకి తీసుకువస్తాం. అలాగే ఎరువులను తయారుచేసేలా కృషి చేస్తాం. పాత బావులు, గుంతల్లో చెత్తను పారబోయకుండా చర్యలు తీసుకుంటాం. తడి, పొడి చెత్తను వేరు చేయాలని చాలాసార్లు అవగాహన కల్పించాం.
>
> – గుగులోతు మోహన్‌నాయక్, ఎంపీఓ అక్కన్నపేట

పోరాటాల ఫలితమే హక్కులు

సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి


మాట్లాడుతున్న మల్లారెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): పోరాటాల ఫలితంగానే ప్రజలకు హక్కులు సిద్ధించాయని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. దూళ్మిట్ట మండల కేంద్రంలో ఆ పార్టీ రెండో మహాసభలను సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన జెండా ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాటంలో భూస్వాములు, రజాకారులకు వ్యతిరేకంగా పోరాటంచేసి 4,500 మంది కమ్యూనిస్టులు నేలకొరిగారని గుర్తుచేశారు. దీని ఫలితంగా 10లక్షల ఎకరాల భూములు పేదలకు పంచామని చెప్పారు. పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలు చేస్తున్నామని తెలిపారు. దేశ స్వాతంత్య్రం కోసం చేసిన పోరాటంతోను, రజాకారులకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంతోను ఎలాంటి సంబంధంలేని బీజేపీ ఆ నాటి పోరాట యోధులను తమ వారసులుగా చెప్పుకోవడం సిగ్గుమాలిన చర్య అని మండిపడ్డారు. సమస్యలు ఉన్నంత కాలం ఎర్రజెండా పోరాటం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు రాళ్లబండి శశిధర్, జిల్లా కమిటీ సభ్యులు చొప్పరి రవికుమార్, బండకింది అరుణ్‌కుమార్, మండల నాయకుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఎల్లప్పుడు అండగా ఉంటా

మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఫారూఖ్

దుబ్బాకటౌన్: పేదలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ అన్నారు. రాయపోల్ మండల కేంద్రంలో అనారోగ్యంతో మృతి చెందిన హమాలీ కార్మికుడు పంబాల రఘు, ఆర్థిక ఇబ్బందులతో మృతి చెందిన ఉషనగళ్ళ రాముల కుటుంబాలను సోమవారం ఆయన పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. అలాగే మంతూర్ గ్రామంలో గుండెపోటుతో మృతి చెందిన పడిగ నరసింహులు, ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మహమ్మద్ ఖాసిం కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవి ఉన్నా లేకున్నా నియోజకవర్గ ప్రజల మధ్యలో ఎల్లప్పుడు ఉంటానన్నారు. పేదలకు సేవ చేయడం ద్వారానే తనకు ఎంతో సంతృప్తి కలుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ లింగాయపల్లి యాదగిరి, మండల కో-ఆప్షన్ మాజీ సభ్యుడు సయ్యద్ పర్వీజ్ అహ్మద్, బీఆర్‌ఎస్ నాయకులు బాగిరెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను వినియోగించుకోండి


వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా వ్యాప్తంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. వారోత్సవాలలో భాగంగా జిల్లా గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్‌లు దాసరి రాజు, కె.రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే అక్షర జిజ్ఞాసను పెంపొందించుకోవాలని సూచించారు. వ్యాస రచన పోటీలలో జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది ముజాఫర్, సాయి, ఉపాధ్యాయులు, పాఠకులు పాల్గొన్నారు.

నేడు మంత్రి పొన్నం పర్యటన

హుస్నాబాద్: రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పట్టణంలో పలు అభివృద్ధి పనులకు మంగళవారం శ్రీకారం చుట్టనున్నారు. ఈ మేరకు సోమవారం మంత్రి క్యాంపు కార్యాలయం నుంచి ఎ ప్రకటన విడుదల చేశారు. బుడిగజంగాల కాలనీ వద్ద మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేసి, మల్లెచెట్టు చౌరస్తాలోని మున్సిపల్ కాంప్లెక్స్‌లో తెలంగాణ ప్రభుత్వ యువజనశాఖ సెట్విన్ కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. విశాల సహకార పరపతి సంఘం వ్యవస్థాపకుడు, మాజీ ఎమ్మెల్యే బొప్పరాజు లక్ష్మీకాంతారావు విగ్రహ ఆవిష్కరణ, అనంతరం నూతనంగా నిర్మించిన సంఘ కార్యాలయ భవనం, గోదాంను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వరావు స్వార్థ విధానాలు సహించం

గజ్వేల్: తన వ్యక్తిగత స్వార్థం కోసమే మాజీ క్రిస్టియన్ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు ఈనెల 27న హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో జాతీయ ప్రార్థన దినాన్ని నిర్వహిస్తున్నారని గజ్వేల్‌లోని గ్లోరియస్ పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షుడు దయారత్నం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఆరేళ్లు ఎమ్మెల్సీగా పనిచేసిన రాజేశ్వర్‌రావు క్రిస్టియన్లకు ఒరగబెట్టిందేమీలేదన్నారు. గతంలో బీఆర్‌ఎస్‌లో కొనసాగి నేడు తన వ్యక్తిగత ప్రయోజనాల కోసమే కాంగ్రెస్‌లో చేరారని ఆరోపించారు. రాజేశ్వర్‌రావు వైఖరిని క్రిస్టియన్లు గమనించాలని కోరారు. ఆయన వైఖరి ఎక్కడికక్కడ ఎండగడతామని హెచ్చరించారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో తమ సిబ్బందితో కలిసి వారం రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో 14మంది పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో సోమవారం హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి వారికి రూ.22,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

నేడు గ్రామసభ

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని కూరెళ్ల గ్రామ పరిధిలో గౌరవెల్లి ప్రాజెక్టు కెనాల్ కింద భూములు కోల్పోతున్న రైతులు మంగళవారం పంచాయతీలో నిర్వహించే గ్రామసభకు హాజరుకావాలని ఆర్‌ఐ ఎల్లయ్య కోరారు. రైతులు ఉదయం 10గంటలకు వచ్చి తమ అభ్యంతరాలు, సూచనలు తెలియజేయాలని కోరారు.

16 వేల ఎకరాలకు సాగునీరు

- భూ సేకరణకు రైతులు సహకరించాలి
- హుస్నాబాద్ ఆర్డీఓ రామ్మూర్తి
- గౌరవెల్లి కెనాల్‌పై గ్రామసభ


మాట్లాడుతున్న ఆర్డీఓ రామ్మూర్తి

కోహెడ(హుస్నాబాద్): గౌరవెల్లి ఎడమ కాలువ భూసేకరణకు రైతులు సహకరిస్తే 16వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని ఆర్డీఓ రామ్మూర్తి అన్నారు. కెనాల్ కోసం సేకరణలో భూమి కోల్పోతున్న కోహెడ, తీగలకుంటపల్లి, సోమవారంపల్లి, కాచాపూర్, వేంకటేశ్వర్లపల్లి, వెల్దండిపల్లి, చెంచల్‌చెర్వుపల్లి గ్రామాల రైతులతో కోహెడ జీపీ కార్యాలయం ఆవరణలో సోమవారం గ్రామ సభ నిర్వహించారు. ఆర్డీఓ హాజరై మాట్లాడారు. మండల వ్యాప్తంగా కెనాల్ కింద 48.16ఎకరాల భూమిని రైతులు కోల్పోతున్నట్లు చెప్పారు. హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మీదుగా 14 కిలోమీటర్లు సాగునీటి కాలువ నిర్మాణం కానుందని, రైతులు భూ సేకరణకు సహకరిస్తే కొద్ది రోజుల్లోనే 16వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు. అలాగే కోహెడ పరిధిలోని 3,282 ఎకరాల భూములకు సాగునీరు అందనుందని తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వం నుంచి రూ.497 కోట్లు నిధులు మంజూరు అయ్యాయని వెల్లడించారు. గౌరవెల్లి ప్రాజెక్టు కరీంనగర్, సిద్దిపేట, జనగామ జిల్లాల రైతులకు లబ్ధి చేకూరుతుందని, ప్రాజెక్టు కుడికాలువ ద్వారా అక్కన్నపేట మీదుగా స్టేషన్‌ఘన్‌పూర్ వరకు సాగునీరు అందనుందని చెప్పారు. ప్రస్తుత ధరకు మూడింతలు అధికంగా పరిహారం అందజేస్తారని తెలిపారు. రైతుల నుంచి వచ్చిన అభ్యంతరాలు, సూచనలను అధికారులు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో నీటి పారుదల శాఖ ఈఈ రమేశ్, డీఈ రేష్మ, తహసీల్దార్ సురేఖ, హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, ఎస్‌ఐ అభిలాష్, ఏంపీఓ శోభ, కార్యదర్శి తిరుపతి, రైతులు పాల్గొన్నారు.

వరి కొయ్యలు కాలిస్తే తీవ్రమైన నష్టం

ఏఓ శివరామకృష్ణ


భూమిని పరిశీలిస్తున్న శివరామకృష్ణ

కొండపాక(గజ్వేల్)/బెజ్జంకి(సిద్దిపేట)/మద్దూరు(హుస్నాబాద్): వరి కొయ్యలను కాలిస్తే భూమిలో పోషక పదార్థాలు తగ్గుతాయని మండల వ్యవసాయాధికారి శివరామకృష్ణ అన్నారు. మండల పరిధిలోని దర్గా గ్రామంలో వరి కొయ్యలను కాలుస్తున్న రైతుల పొలాలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి కొయ్యలను కాలిస్తే పర్యావరణానికి హాని కలుగుతుందన్నారు. అలాగే భూమిలో ఉండే నత్రజని, పాస్ఫరస్, పొటాషియం లాంటి పోషకాలు నశించడంతో దిగుబడులు తగ్గుతాయని చెప్పారు. భూమిలో నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం తగ్గిపోతుందని తెలిపారు. పంటను కోసిన వెంటనే ఎకరా పొలంలో 50కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్‌తో పాటు 15కిలోల యూరియాను దుక్కిలో చల్లుకొని నీరు పెట్టి రోటావేటర్‌తో దున్నుకోవడంతో 20నుంచి 30రోజుల్లో భూమిలో అవశేషాలు కుళ్లి సేంద్రీయ కార్బన్ శాతం పెరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ సంధ్య, రైతులు పాల్గొన్నారు. వరి కొయ్యలు పొలంలోనే మురగబెడితే భూమిలో పోషకాల పెంపునకు దోహదం చేసే సూక్ష్మజీవులు పెరుగుతాయని ఏఓ సంతోష్ పేర్కొన్నారు. ఒక్కసారి పొలంలో కొయ్యలు కాలిస్తే 25 సంవత్సరాల వరకు భూమికి పోషకాలు అందక నష్టం వాటిల్లుతుందని, రైతులు కొయ్యలను తగలబెట్టవద్దని సూచించారు. వరి కొయ్యలను కాలిసస్తే భూమిలో ఉండే సూక్ష్మజీవులు చనిపోవడం వల్ల భూమి సారవంతం తగ్గుతుందని మద్దూరు మండల వ్యవసాయ అధికారి అఫ్రోజ్ అన్నారు.

ఆయిల్‌పామ్‌తో అధిక లాభాలు

ఏఓ వెంకట్రావమ్మ

కొమురవెల్లి(సిద్దిపేట): సంప్రదాయ పంటకు స్వస్తి పలికి తక్కువ పెట్టుబడితో దీర్ఘకాలిక రాబడి వచ్చే ఆయిల్ పామ్ సాగుచేసి రైతులు అధిక లాభాలు పొందాలని మండల వ్యవసాయాధికారి వెంకట్రావమ్మ పిలుపునిచ్చారు. మండలంలోని అయినాపూర్, తపాస్‌పల్లి గ్రామాలలో రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పామాయిల్ పంట ఎకరాకు 57మొక్కలు నాటవచ్చని, ఈ మొక్కలు ఒక్కసారి నాటితే 30యేళ్ల పాటు దిగుబడి వస్తుందన్నారు. మొదటి మూడేళ్ల దిగుబడి రాకపోయినా అంతరపంటల ద్వారా ఆదాయం పొందవచ్చని తెలిపారు. ప్రతి యేటా ఎకరానికి 15 నుంచి 17టన్నుల దిగుబడి వస్తుందని, కూలీల అవసరం పెద్దగా ఉండదని చెప్పారు. అలాగే వరి కోతల అనంతరం రైతులు వరి కొయ్యలను కాల్చవద్దని సూచించారు. వరి కొయ్యలు కాలిస్తే వచ్చే నష్టాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తిని చాటాలి

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాశ్


నియామక పత్రం అందజేస్తున్న ప్రకాశ్

హుస్నాబాద్: అంబేడ్కర్ భావజాలాన్ని పల్లెలు, పట్టణాలకు మరింతగా తీసుకువెళ్లాలని తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాశ్ పిలుపునిచ్చారు. సోమవారం నియోజకవర్గ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నియోజకవర్గ అధ్యక్షుడిగా గడిపె సంజీవ్‌ను నియమించి పత్రాన్ని అందజేశారు. అనంతరం మాట్లాడుతూ సంఘం బలోపేతం కోసం రాష్ట్ర, నియోజకవర్గ, జిల్లా, మండల కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమావేశంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మేకల చేరాలు, రాష్ట్ర కార్యదర్శులు తొందూరి ఎల్లయ్య, కండె సుధాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ ఏర్పాట్లను పరిశీలించిన ఎంపీడీఓ


పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ గణేశ్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): మండల కేంద్రమైన మిరుదొడ్డిలోని బ్రాహ్మండ్ల కుంటలో నిర్వహిస్తున్న నర్సరీ ఏర్పాట్ల పనులను ఎంపీడీఓ గంగుల గణేశ్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కల పెంపకానికి ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న నర్సరీ కేంద్రాలకు అవసరమైన పాలిథిన్ కవర్లను పంపిణీ చేశామన్నారు. కవర్లల్లో మట్టిని నింపి మొక్కల పెరుగుదలకు త్వరితగతిన చర్యలు చేపట్టాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి ఫహీం, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ చల్లూరి రాము తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ సమష్టి కృషితోనే మహిళల ఆర్థికాభివృద్ధి

మిరుదొడ్డి(దుబ్బాక): మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎంపీడీఓ గంగుల గణేశ్‌రెడ్డి, ఐకేపీ ఏపీఎం డాకయ్య పిలుపునిచ్చారు. మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం వీఓఏ లీడర్లతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా గ్రామైక్య సంఘాలల్లో సభ్యులుగా లేని మహిళలను కొత్తగా చేర్పించే విధంగా వీఓఏలు చొరవ తీసుకోవాలని సూచించారు. 18యేళ్లు నిండి, 58 యేళ్లలోపు మహిళలకు గ్రామైఖ్య సంఘాల్లో సభ్యత్వం ఇవ్వాలని, వారు ఆర్థికంగా ఎదగడానికి బ్యాంకు రుణాలివ్వాలని కోరారు. రుణాలకు తిరిగి సకాలంలో చెల్లించేలా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సీసీలు వైకుంఠం, మహేశ్, బాల్‌రాజు, వీఓఏ లీడర్లు తదితరులు పాల్గొన్నారు.

◆ ఆవాస విద్యాలయంలో వనభోజనాలు

సిద్దిపేటఅర్బన్: అర్బన్ మండలం తడ్కపల్లి గ్రామంలోని విద్యారణ్య ఆవాస విద్యాలయంలో కార్తీకమాసం సందర్భంగా వన భోజనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతి విద్యాపీఠం జిల్లా కార్యదర్శి సాంబశివరావు మాట్లాడుతూ ఎలాంటి వివక్ష లేకుండా అందరూ కలిసి మెలిసి ఉండేందుకు ఈ వన భోజనాలు దోహదపడతాయన్నారు. కార్తీక మాసంలో వెలిగించే దీపాలు వాతావరణంలో ఉన్నటు వంటి చెడు క్రిములను నశింపజేస్తూ ఆరోగ్యానికి మేలు చేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు శేఖరం, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, జిల్లా సహాయ కార్యదర్శి వీరారెడ్డి, లింగమూర్తి, లయన్స్ క్లబ్ ప్రతినిధి జోషి, ప్రధానాచార్యుడు పాల్గొన్నారు.

◆ బియ్యం అందజేత

చేర్యాల(సిద్దిపేట): పట్టణ పరిధిలోని 12వ వార్డుకు చెందిన తుమ్మలపల్లి సత్తయ్య ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పట్టణ నాయకురాలు మానస సోమవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి 50కిలోల బియ్యం అందజేశారు. ఆమె వెంట నాయకులు అమర్, బాచి తదితరులు ఉన్నారు.

◆ విద్యార్థులకు శిక్షణ అవసరం

హుస్నాబాద్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సయనో హబ్ సంస్థ సహకారంతో విద్యార్థులకు సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సంస్థ ప్రతినిధులు ధీరజ్, వంశీ పలు విషయాలను వివరించారు. ప్రిన్సిపాల్ భిక్షపతి మాట్లాడుతూ విద్యార్థులకు ప్రస్తుతం అవసరమయ్యే నైపుణ్యాలపై శిక్షణ అవసరమన్నారు. అధ్యాపకులు కుమారస్వామి, సుధా మాధురి, రాజ్యలక్ష్మి, బాలరాజు, చంద్ర మౌళి, రమేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

◆ ప్రిన్సిపాల్‌కు పూర్వ విద్యార్థుల సన్మానం

మిరుదొడ్డి(దుబ్బాక): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేసి, అదే కళాశాలకు ప్రిన్సిపాల్‌గా పదోన్నతిపై వచ్చిన కె.శారదను నైపుణ్య ఆర్గనైజేషన్ యువజన విభాగం అధ్యక్షుడు పసులకాడి రమేశ్ ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులు సోమవారం ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. పూర్వ విద్యార్థులు ఐలయ్య, భైరయ్య, విష్ణు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారులు రామచంద్రయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ పాఠశాలలో గ్రంథాలయం ఏర్పాటు

సిద్దిపేటరూరల్: ఆర్‌డీఎఫ్ మాటిండ్ల పాఠశాలలో పుస్తకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతనంగా గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసినట్లు కరస్పాండెంట్ విష్ణుమూర్తి సోమవారం తెలిపారు. 700 కథల పుస్తకాలను గ్రంథాలయంలో ఉంచినట్టు చెప్పారు.

◆ 21న మండల స్థాయి 'చెకుముకి'

చేర్యాల(సిద్దిపేట): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 21న చెకుముకి మండల స్థాయి సైన్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి కొడిపల్లి ప్రశాంత్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతియేటా నవంబరులో హైస్కూల్ స్థాయి విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన పెంచేందుకు ఈ సంబురాలు నిర్వహిస్తున్నామని, ఆయా పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించి పరీక్షకు సిద్ధంచేయాలని కోరారు.

◆ సీపీఎం మండల కార్యదర్శిగా శ్రీనివాస్

బెజ్జంకి(సిద్దిపేట): సీపీఎం మండల కార్యదర్శిగా మండలంలోని రేగులపల్లికు చెందిన తిప్పారపు శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్టు ఆపార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కమిటీ సభ్యులుగా సాయికృష్ణ, ఎల్లయ్య, చంద్రయ్య, లింగం, ప్రభాకర్, మల్లేశం, తిరుపతి ఎంపికైనట్టు తెలిపారు.

◆ సీఎం సభను జయప్రదం చేయండి

చేర్యాల(సిద్దిపేట): వరంగల్‌లో మంగళవారం జరిగే సీఎం సభను జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొమ్ము రవి పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పుర్మ ఆగంరెడ్డితో కలిసి సోమవారం ఆయన మాట్లాడారు. బహిరంగ సభకు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. చిరంజీవులు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.